# సర్వస్వం

లేత నీలం నీళ్ళ మీద మెరుస్తున్న బంగారం లాంటి యెండ.

శీతాకాల సాయంత్రపు రంగం మీదికి రాత్రి మంచు మేలిముసుగు తొడుక్కుని

పారాడుతూ వస్తూంది. ఆహ్లాదకరమైన సన్నటి వణుకు వెన్ను పొడువునా జరజరా పాకుతోంది.

చిన్న కళ్ళ అమ్మాయి యీత కొడుతోంది. అప్పటివరకు యీతకొట్టి రెస్ట్‌ఛెయిర్‌లో రిలాక్స్‌డ్‌గా పడుకొని వుందో అమ్మాయి. పూల్‌కి మరోవైపు వో వైట్ పడుకొని పుస్తకం చదువుకుంటున్నాడు. లాన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు జమైకన్ జంట. బటర్‌పై విన్యాసాలు ముగించి నీళ్ళల్లోంచి బయటకి వచ్చాను. రెస్ట్‌ఛెయిర్ మీద కూర్చుని తెల్లని టవల్‌తో శరీరం మీద నీటిని అద్దుకొన్నాను. కాళ్ళు చాపుకొని కుర్చీలో పడుకొన్నాను.

స్టీవర్డ్ ఫ్రూట్‌జ్యూస్ తీసుకొచ్చి యిచ్చాడు.

'భలేవుంది మీ యీత. యెంజాయ్ చేసాం' దగ్గరకి వచ్చి చెప్పారు జమైకన్ జంట.

'థాంక్ యూ'

'యిండియాలో చాల మందికి స్విమ్మింగ్ తెలియదు. ముఖ్యంగా ఆడవాళ్ళకి' డొమెస్టిక్ ఫ్లైట్‌లో విదేశీ ప్రయాణీకురాలు అందోసారి.

యింటా బయటా మనకు మనం నిలదొక్కుకోడానికి బోల్డంత యీత కొట్టాలి కదా. యిక ప్రత్యేకంగా యీత నేర్చుకునే సమయమూ లేదు. అవకాశమూ లేదు. అయినా ఆ యీత ముందు యీ యీత యెంత?

అయినా వో వయస్సు వచ్చాక తొక్కుడుబిళ్ళో. బంతాటో ఆడుకోవటమే నిషిద్ధం. యింక యీత యెక్కడ?

కొబ్బరాకుల సందుల్లోంచి శరీరంపై వాలుతోన్న లేతయెండ. అలసటపోయి కొత్త శక్తిని పుంజుకున్న వుత్సాహం. డ్రస్సింగ్ రూంలోకి వెళ్ళి డ్రస్ మార్చుకున్నాను. తల దువ్వుకొని రెస్టారెంట్ వైపు వెళ్ళాను.

'గుడ్ యీవినింగ్' మెనూ కార్డు అందించింది సూపర్‌వైజర్.

గ్లాస్ విండో నుంచి బయటకి చూస్తుంటే నీడలా పర్చుకొన్న యెండ.

'హాయ్ గగన్' పలకరిస్తూ షేక్‌హాండ్ యిస్తూ యెదురుగా కూర్చున్నాడు సుమిత్.

'హాయ్'

'ట్రాఫిక్ జామ్' సంజాయిషీ యిచ్చాడు.

'కామన్ ప్రాబ్లమ్'

'మీకూ్కడానా? చాలా ఫ్లైవోర్స్ వస్తున్నాయంటగా. కొన్ని పూర్తి అయ్యాయన్నారే'

'వూ'

బ్లాక్‌కాఫీ ఆర్డర్ చేశారు.

'సో హౌ ఆర్ యూ' అడిగాడు సుమిత్.

'వోకే... మీరు'

'ఆల్‌రైట్. కాన్ఫరెన్స్‌కి మీరు వస్తున్నారని తెలిసింది.

'చాలకాలం తర్వాత కలిసాం. అఖిల్ యెలా వున్నారు? వో శాటిలైట్ ఛానల్ తీసుకున్నాం. మీకు తెలుసు కదా. ఛైర్‌మెన్‌తో మాట్లాడటానికి అరేంజ్‌మెంట్ చేస్తాం. మీ యేరియా నుంచి మంచి బిజినెస్‌ని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. మీరెవరినైనా సజెస్ట్ చేస్తారా? అలానే మీ యేరియాలో జండర్ సెన్సిటివిటీ మీద వోరియంటేషన్ క్లాసెస్ పెడదాం అనుకుంటున్నాం' అన్నాడు.

'యెవరైనా ప్రపోజల్స్ పంపించారా?'

'వూ...నాల్గైదు ప్రపోజల్స్ వచ్చాయి. అందులో మురళి ప్రపోజల్ బాగుంది' అన్నాడు.

'మురళికి ప్రపోజల్ రాయటం బాగవచ్చో లేక బాగరాయగలిగేవాళ్ళు తెలుసో తెలియదు. కానీ అతనికేం సెన్సిటీవ్స్ లేవు వొకప్పుడు. కాన్ఫరెన్స్‌కి అతనూ వచ్చారు'

'ఐసీ. మీ వెంచర్‌కి యెవరిస్తున్నారు'

'రీజన్‌వైజ్‌గా ఆనంద. మొత్తం ప్రోగ్రామ్‌కి త్రీ క్లాసెస్ అపర్ణాఘోష్‌కి యిచ్చారు. కొత్త వెంచర్‌కి యిప్పుడు డిసైడ్ చెయ్యాలి'

'సో, వెళ్లేలోగా మళ్లీ కలుద్దాం' అన్నాడు సుమిత్.

'ష్యూర్'

వెళదామని అనుకుంటుండగా 'కాఫీ తాగుదామా' అంటూ వచ్చాడు మురళి.

'నో థాంక్ యూ' అంటూ అతనిని పట్టించుకోకుండా బయటికి వచ్చేసాను.

సుమిత్ వెళ్ళిపోయాడు.

'అసలు తెలియనట్టే ప్రవర్తిస్తావేం? యెలా పడ్డావ్ నావెంట. హాస్టల్లో నా గదిముందు తలుపు తీయవా అంటూ యేడుస్తూ యెలా నిలబడేదానివి. యిప్పుడు మేం యెందుకు గుర్తుంటాం. నాబుక్స్ పట్టుకెళ్ళి చదివేదానివి. పోనీలే నీ సర్వస్వం మొదట నాకేగా అర్పించావ్. ఆ క్రెడిట్ నాదేగా. అసలు అప్పుడు నువ్వు అడిగినట్టు నిన్ను పెళ్లి చేసుకొని వుంటే నువ్వీ పొజిషన్‌లోకి వచ్చుండేదానివా?' అంటున్నాడు మురళి.

లిఫ్ట్ డోర్ తెరుచుకుంది.

'అప్పటికంటే రంగు తేలావ్. కండపట్టావ్. మందు కొడుతున్నావా? యీత నేర్చుకున్నట్టున్నావ్? సిగరెట్స్ కాలుస్తున్నావా?

ఫోర్త్‌ఫ్లోర్‌లో లిఫ్ట్ ఆగింది.

రూం లాక్ తీసి లోపలికి వెళ్ళబోతుంటే అతనూ రాబోయాడు. తలుపు వేసేసాను.

టి.వి ఆన్ చేసాను. బి.బి.సి, సి.ఎన్.ఎన్, స్టార్ న్యూస్, స్టోరీస్. బిజినెస్ న్యూస్. మనసు డాలర్స్‌పై, పౌండ్స్‌పై నిలవటం లేదు.

మురళి!!

అవే మాటలు. అదే మనిషి. పదేళ్ళకాలం అతనిలో యే మార్పుని తీసుకురాలేదు. యితను జండర్ సెన్సిటివిటి మీద వోరియంటేషన్ క్లాసెస్ తీసుకుంటాడు. చిన్నా చితకా సెక్షన్స్‌కి కాదు. పైగా రోల్ మోడల్‌గా తయారయ్యాడు.

అవి యూనివర్సిటీకి వచ్చిన తొలిదినాలు. సిటీ కొత్త. కుతూహలం. బెరుకు. మురళి ప్రేమ అన్నాడు. అదే ప్రేమ అనుకున్నాను. పెళ్ళి చేసుకుందాం అన్నాడు. నిజమనుకున్నాను. కులం మతం అంతా రాజకీయం అన్నాడు. సరిగ్గా అర్థం కాలేదు. కాని అతనికి కులమతాల పట్టింపులేదని అంటున్నాడు అనుకున్నాను. ప్రేమ తప్ప యీ ప్రపంచంలో యేది ముఖ్యం కాదనిపించేది. హాస్టల్లో మురళి గదిలోనే కలుసుకునేవాళ్ళం. వొకరోజు శారీరకంగా దగ్గరయ్యాం. తర్వాత కొద్దిరోజులకే మురళి మరో అమ్మాయితో గదిలో కనిపించాడు. ప్రేమంటే కచ్చితంగా పెళ్ళిచేసుకోవడమేనని నమ్మానేమో మురళి ప్రవర్తనని భరించలేకపోయాను.

'యెందుకిలా చేస్తున్నావ్'

'నా యిష్టం'

'మనం పెళ్ళి చేసుకుందాం అనుకున్నాంగా'

'అనుకుంటే'

'మరి యీ పనేంటి?'

'నా యిష్టం'

'యేంటి నీయిష్టం! యిలా ప్రవర్తిస్తే యెంత బాధగా వుంటుంది'.

'బాధ పడితే నీ సమస్య. నాకేం సంబంధం? నేనెలా ప్రవర్తించాలో నువు చెపుతావేంటి? మా పక్కరూమ్మేట్ ప్రస్తుతం ఖాళీగానే వున్నాడు వెళ్ళు. యెవరు యెవరితోనైనా వెళ్ళే రైట్ వుంది. యింకెప్పుడు నా విషయంలో కలగచేసుకోకు'.

'యెంత కేర్‌లెస్‌గా మాట్లాడుతున్నావ్'

'కేర్ చేయడానికి యింకా నీలో యేముంది? నీ వెంట తిరగటానికి వున్న శరీరమూ యిచ్చేసావ్ యింకా యేముంది నీలో? యేయ్ పో. యేడవకు చిరాకు' గదిలోంచి బయటకి నెట్టేసి తలుపు వేసేసుకున్నాడు.

కాసేపు తలుపు దగ్గరే నిలబడి తట్టాను. తలుపు తీయలేదు. కసి, అవమానం. నా కోపాన్ని బాధని అసహ్యాన్ని అతనిపై యెలా కుమ్మరించాలో తెలియలేదు.

స్నేహం ప్రేమ పెళ్ళి అని చుట్టూ తిరిగింది అతను. పెళ్ళి చేసుకోమని సతాయిస్తున్నానని తన స్నేహితులందరి ముందు చిత్రించి అవమానిస్తుంటే యేడవటం తప్ప యేమి తెలియనితనం. అతని స్నేహితులు అతనిలాంటివారే. వాళ్ళందరి ప్రవర్తనలో తేడా లేనితనం.

అతనొట్టి ఫూల్ అని తెలుస్తుంటే యెందుకలా యేడుస్తావ్? వోదార్చుకున్న ఆగని గుండెరొద.

యింత అవలీలగా అవమానానికి లోనయ్యాను?

దహించివేస్తున్న అవమానం.

బోల్డంత మంది ఆడపిల్లలు చుట్టూ. యెవ్వరితోనూ యీ విషయం షేర్ చేసుకోలేదు. అతను తిరస్కరించటం. ఆ మాటలు. యివే ఆలోచనలు.

ప్రపంచంలో అతనిని బాధించే విషయం యేది లేనట్టుంది. యేం చేస్తే

అతనికి నా బాధ అర్థం అవుతుంది?

చావు తప్పా అతనిని యేదీ బాధపెట్టలేదేమో?!

నిద్రమాత్రలు మింగేసాను.

* * *

హాస్టల్లో నా గది.

'యీ అమ్మాయి పేరు శారద. నీలానే వూరు నుంచి హాస్టల్‌కి వచ్చింది. ఆనంద్‌కుమార్ ప్రేమ కురిపించాడు. అతనిని హాస్టల్లో అతని గదిలోనే కలిసేది. శారదకి ఆనంద్‌కుమార్‌ని అంచనా వేయటం రాలేదు. అలా వెయ్యాల్సిన అవసరమూ కనిపించలేదు. అతనికి చాలమంది అమ్మాయిలతో సంబంధాలుండేవి. వాళ్ళంతా యూనివర్శిటీ అమ్మాయిలు కారు. సో శారదకి అసలు యీ విషయం తెలియకుండాపోయింది. శారదని విపరీతంగా హ్యూమిలియట్ చేసాడు. శారద యేమనుకుందో యేమో అతనికి బుద్ధి చెప్పాలనుకుందో యేమో తెలియదు. ఆమెది ఆత్మహత్య అని కొందరు ఆనంద్‌కుమార్ చేసిన హత్య అని కొందరు అన్నారు. అంతా కలిసి ఆ యిష్యూ మీద పని చేసాం. చేస్తున్నంత సేపు నాకేమో గిల్టీగా అనిపించేది. బతికివుండగా మనమంతా యెందుకు కలవలేకపోయాం? మగవాళ్ళు విసిరే నమ్మకాలు వురితాళ్ళు అవుతున్నాయి. వాటిని తెంపేసే నమ్మకాన్ని ఆడవాళ్ళం మనలో మనం యెందుకు పెంచుకోలేక పోతున్నాం? ఆ తర్వాత వో రేప్‌కేస్‌లో పనిచేసాం.

ధైర్యంగా సాక్ష్యం యిచ్చారు. సాక్ష్యం చెప్పిన వాళ్ళని బెయిల్ మీద బయటికి వచ్చిన అతను బెదిరించటం మొదలుపెట్టాడు. అయినా మేం యెవ్వరం బెదరిపోలేదు. చెదిరిపోలేదు. యిష్యూస్ మీద పనిచేస్తూనే వున్నాం. మురళిలాంటి వాళ్ళు యెక్కడ చూసినా కనిపిస్తారు. వాళ్ళని గుర్తుపట్టి దూరంగా వుంచే స్కిల్స్‌ని మనం తెచ్చుకోవాలి. కాఫీ తాగుతావా' అడిగింది ఆర్తిసేన్.

కాఫీ యిచ్చింది.

'యెలా తెలుసు' శారద ఫోటో నుంచి చూపులు తిప్పుకుంటూ అడిగాను.

'యేంటి?'

'మా యిష్యూ'

'అలా తెలుస్తునే వుంటాయి'

'రిసెర్చ్ స్కాలర్స్ హాస్టల్లో అమ్మాయిలకి మా విషయం తెలుసా? యెవరికి తెలుసు? అందరికి తెలుసా? యింతమందికి తెల్సిపోయిందా?'

'ఆలోచనలు వదిలై. క్లాస్‌కి వెళతావా?'

'క్లాస్‌కా? నేనిలా చేసానని అందరికి తెలిసిపోయిందిగా'

'తెలిస్తే? తెలియని మురళి మీద సుజన కంప్లైయింట్ యిచ్చింది'

'యేమని'

'నీకు చెప్పిన మాటలే కాస్త అటు యిటుగా సుజనకి చెప్పాడు. నీవిషయం సుజనకి తెలుసు. కానీ నువ్వే వెంటపడుతున్నావన్న అతని మాటలు నమ్మింది. అతను ఆమెతో బాగుంటాడని నమ్మింది. అలా అనుకోవటంలో ఆమెకి కొంత కంఫర్ట్ వుందేమో కాని మురళి తనేమిటో యెక్కువ కాలం దాచుకోలేదు. సుజన అతనిని వదిలిపెట్టాలనుకోవటం లేదు. వీలైతే నువ్వు ఆలోచించు. రెడీ అయి క్లాస్‌కి వెళ్ళు. యెప్పుడోకప్పుడు యెక్కడో దగ్గర జీవితాన్ని తిరిగి మొదలుపెట్టాలిగా'.

ఆర్తిసేన్ గదిలోంచి బయటకి వెళ్ళినా ఆమె జీవశ్వాస పరిమళం మాత్రం యింటిమేట్‌గా వుండిపోయింది.

* * *

ఆర్తికి కృతజ్ఞతలు చెప్పాలనిపించేది. కాని యెప్పుడూ చెప్పలేదు. విషయాలని షేర్ చేసుకోవటానికి మొహమాటంగా వుండేది.

వో రోజు ఆర్తి 'జీవితాన్ని సీరియస్‌గా తీసుకోవటం విషయాలని సెన్సాఫ్ హ్యూమర్‌తో డీల్ చేయటం మా అమ్మ నుంచి నాకొచ్చింది. నాతండ్రి యెవరో నాకు తెలియదు. తెలుసుకోవాలని యెప్పుడు అనిపించలేదు. మా అమ్మ వో రేప్ విక్టిమ్. అలా పుట్టాను. యిది దాచి వుంచాల్సిన విషయమని అమ్మా అనుకోలేదు. నేనూ అనుకోలేదు. విషయాలని పంచుకున్నప్పుడు కొన్నిసార్లు ఆ యిన్ఫర్మేషన్‌తో అటాక్ చేస్తారు. అయినా మనం యెదుర్కోగలం అనుకున్నప్పుడు నమ్మకం వున్నప్పుడు షేర్ చేసుకోవచ్చు. అయితే ప్రైవసీకి బహిరంగపర్చటానికి తేడా అనుభవం నుంచే తెలుసుకోవాలి' అంది.

అలా అలా మురళి...నిద్రమాత్రలు...ప్రేమ...పెళ్ళి...మోసం... యెటో వెళ్లిపోయి ఆ అనుభవం తిరిగి యెప్పుడూ ప్రేమా అని అవమానపు దారుల్లోకి వెళ్లనీయలేదు. వ్యక్తిత్వాన్ని సుసంపన్నం చేసే ప్రేమని గుర్తించగలిగాను.

యిదిగో యిన్నాళ్ళకి తిరిగి యిక్కడ మురళి యిలా కనిపించి అలానే మాట్లాడుతున్నాడు. యేం చెయ్యాలి అనే ఆలోచనే రావటం లేదు.

లోపలంతా కంపరంగా లేదు.

రిసీవర్ తీసి నెంబర్ డయిల్ చేసాను.

హ..లో.. ఆర్తి స్వరం గట్టిగా.

'థాంక్యూ'

'యెవరు?'

'థాంక్యూ'

వో సెకన్ తర్వాత గట్టిగా పరవశంగా ఆర్తి నవ్వు.

'యెట్‌లాస్ట్' తిరిగి గుక్కతిప్పుకోకుండా నవ్వుతూ 'జండర్ సెన్సిటివిటీ అంటే యేంటి? విమెన్ సాలిడారిటి అంటే యేంటి మమ్మీ అని అడుగుతోంది నాకూతురు. మార్చి 8 స్కూల్లో ఎస్సే కాంపిటీషన్, ఎలక్యూషన్. సో థాంక్స్... తట్టాబుట్టా సర్దుకోకుండా క్లాసుకి వెళ్ళావుగా. థ్యాంక్స్ చెప్పేసావ్. హార్స్ రైడింగ్‌లో జాయిన్ అయ్యాను. బలే వుంది...' చెపుతోంది ఆర్తి.

రిసీవర్ క్రెడిల్ చేసి టీ.వి.పై చూపు నిలిపాను. నిలవటం లేదు.

యెంతసేపు నీతో గడిపినా లెక్కపెట్టటానికి యింకా మిగిలిపోయిన నక్షత్రాల్లా బోల్డన్ని విషయాలు వుంటునే వుంటాయి. యెప్పటికైనా నువ్వు పూర్తిగా అర్థం అవ్వటం సాధ్యమా? జీవనంలో ఆనందమూ విషాదమూ యిరుకు విశాలత్వం కలిసే వుంటాయని ఆ జీవితాన్ని జీవించటంలోనే జీవనసాఫల్యం దొరుకుతుందని మరణం చివరి వరకు జీవనారంభంలోనే వెళ్లొచ్చిన నీ అనుభవం జీవితాలని సుసంపన్నం చేస్తుంటే గగన్ నిజం చెపొద్దూ...

కోటి కలల కిక్కిరిసిన
నీ కన్నుల మీద
లక్షముద్దుల కోసం పరుచుకున్న

నీ అర్ధచంద్రుడి నుదిటిమీద

నాకు

కవిత్వం కవిత్వంగా వుంది

యెడతెగని

మోహం మోహంగా వుంది.

- అఖిల్

మురళి యేమన్నాడు? యేముంది నీలో? నీ సర్వస్వం నాకిచ్చేసావ్? యేముందింకా నీలో? నీ వెంటపడి తిరగడానికి? పెళ్ళికి? ప్రేమకి? అఖిల్ యేమన్నాడు? ప్రేమో స్నేహమో యిష్టమో యెప్పటికైనా నువ్వు పూర్తిగా తెలుస్తావా?

వొక్క శారీరక అనుభవంతో సర్వస్వం తెలిసిపోయావు అని తూలనాడిన మురళి? అసలు నువ్వు యెప్పటికైనా తెలుస్తావా అని ఆరాధించే అఖిల్. అసలు యెవరికైనా యెవరైనా పూర్తిగా తెలియటం వుంటుందా?

ఫోన్ మోగింది.

'హాయ్ గగన్. రేపటికి మన పార్ట్‌నర్స్ లిస్ట్ ఫైనలైజ్ చేయటం అయిపోతుంది కదా' సంజయ్‌కపూర్ అడుగుతున్నాడు.

'రేపటి వరకు యెందుకు? కాసేపట్లో యింటర్వ్యూస్ వున్నాయి. అవ్వగానే హాట్‌లైన్‌లో ఫైనల్ లిస్ట్ చూసుకోవచ్చు. ఫోన్ చేస్తా'

'థ్యాంక్ యూ'

సంజయ్ మంచి ప్రొఫెషనల్ పర్సన్. అతని దగ్గర పనిచేయటం మొదలుపెట్టాక చాల విషయాలని క్రమపద్ధతిగా చేయటం నేర్చుకున్నాను. అతను క్రమశిక్షణతో పనిచేయటం వల్లే అతనీ రోజు అతని ఫీల్డ్‌లో సక్సెస్‌ఫుల్ పర్సన్.

కాన్ఫరెన్స్ హాల్‌కి వెళ్ళాను.

యింటర్వ్యూస్ పూర్తిచేసి ల్యాప్‌టాప్ తెరిచాను. తిరిగి మరొక్కసారి అందరికి సంబంధించిన ఫైల్స్‌ని చూసుకున్నాను. రిపోర్ట్ పూర్తి చేసి సంజయ్‌కపూర్‌కి కాల్ చేసాను.

'యస్ గగన్'

'ఫైనల్ రిపోర్ట్ చూసుకో. యేమైనా క్లారిఫికేషన్స్ వుంటే క్లియర్ చేస్తా'

కాసేపటి తర్వాత సంజయ్ లైన్‌లోకి వచ్చి 'గుడ్. యెగ్రిమెంట్ చేసుకోవచ్చు. నిన్ను మెచ్చుకోకుండా వుండలేకపోతున్నా. జండర్ సెన్సిటివిటీ లేని వాళ్ళ ఫైల్స్‌ని రిజక్ట్ చేసినందుకు. యిప్పుడేం చేద్దాం? స్టేట్ హెడ్స్‌కి ఆర్గనైజేషన్ హెడ్స్ అందరికి ట్రయినింగ్ యిద్దామా'

'సంజయ్ మన కాంట్రిబ్యూటర్స్ యెక్కువగా స్త్రీలే. యెక్కడెక్కడో మారుమూల ప్రాంతాలలోకి వెళ్లి బోల్డంత మెటీరియల్‌ని అందిస్తుందంతా స్త్రీలే. వాళ్ళందరికి మనం అనేక విషయాలలో ట్రైనింగ్ యిస్తున్నాం. అలానే జండర్ సెన్సిటివిటీ మగవాళ్లకి లేకపోతే యెవరికి యే ట్రయినింగ్ యిచ్చినా ప్రయోజనం యేముంది? వాళ్లకి యిస్తే తీసుకుంటారా?'

'యీసారి వాళ్ళకి ట్రయినింగ్ యిద్దాం. నో అంటే మనం అగ్రిమెంట్ కాన్సిల్ చేసుకుంటాం. ఆ క్లాజ్‌తో అగ్రిమెంట్ రెడీ చేయించండి. గుడ్. రియల్లీ గుడ్. సీయూ. గుడ్‌నైట్'

'గుడ్‌నైట్'

నిశ్శబ్దం. మబ్బు వెలుగు. చల్లదనం. పచ్చని పూల పరిమళం... దిండుకి తల ఆనిస్తుండగా ఫోన్ మోగింది.

'యింటర్వ్యూ యెలా చేసావ్' ఆర్తిసేన్ స్వరంలో ఆసక్తి.

'అయిపోయింది'

'కమాన్ చెప్పు, చెప్పు'

'యూ క్రేజీ'

'గగన్, అనేక వర్క్‌షాప్స్‌లో నిన్ను చూసాను. అతన్ని చూసాను. ముఖ్యంగా నీ యింటర్వ్యూ వినాలనుకోవటంలో ప్రొఫెషనల్ - పర్సనల్ ఆసక్తి. చెప్పు చెప్పు'

యింటర్వ్యూ బోర్డులో ముగ్గురం వున్నాం. మురళి వచ్చాడు. నేవీ బ్లూ సూట్.

'రేమండ్ సూట్' అడిగా.

'వూ' కనురెప్పలు ఆర్పి విప్పుతూ అన్నాడు.

'ఎర్రనిగీతతో అండర్‌లైన్ చేసిన రేమండ్ క్యాప్షన్ కంప్లీట్‌మేన్‌ని చూసి

యిన్స్పైయిర్ అయ్యారా?'

'హో ఆఫ్‌కోర్స్' భుజాలు యెగరేస్తూ చెప్పాడు.

'జండర్ సెన్సిటివిటీ అంటే యేమిటి?'

'జండర్ సెన్సిటివిటీ...జండర్ సెన్సిటివిటీ... 39 దేశాలలో సెమినార్స్‌లో పాల్గొన్నాను. 176 వర్క్‌షాప్స్ కండక్ట్ చేసాను. అలాంటి యిలాంటి సంస్థలకి కాదు. మీరేమో జండర్ సెన్సిటివిటీ అంటే యేమిటని అడుగుతున్నారు. చాల తేలికైన చిన్ని ప్రశ్న'

'నిజమే! చిన్ని ప్రశ్న. తేలిక ప్రశ్న. వో.కే. మిస్టర్ మురళి సర్వస్వం అనేదానికి జండర్ వుంటుందా?'

మురళి కనుబొమ్మల చివర్లు దగ్గరకి అయ్యాయి.

'యిదీ చిన్ని ప్రశ్నలానే వుందా మిస్టర్ మురళి. వో.కే. సర్వస్వం అనేది ఆడవాళ్ళకే వుంటుందా? మగవాళ్ళకీ వుంటుందా? మగవాళ్ళకి వుంటే అదేమిటి?' మురళి కళ్ళు చిట్లుతున్నాయి.

చిన్నగా కదిలిన పెదవి వెనుక పళ్ళు బిగుసుకుంటున్నాయి.

'థ్యాంక్ యూ వెరీమచ్ మిస్టర్ మురళి. యిక మీరు వెళ్ళొచ్చు' అన్నాను.

లేవలేకపోయాడు మురళి.

'అందుకే అడిగాను చూసావా. యివి నాకెప్పుడు తట్టని ప్రశ్నలు. నువ్వు మాత్రమే అడగగలిగే ప్రశ్నలు. అవమానం నుంచి నువ్వు యెదిగిన తీరు... ఐ లవ్ యూ గగన్, ఐ.లవ్.యూ' అంటోంది ఆర్తిసేన్.

♦